సాక్షి
రాజన్న సిరిసిల్ల
ఆదివారం । 28 । జూలై । 2024

సండే స్పెషల్



● అమ్మానాన్న.. పిల్లలే మిన్న

అమృతమైనా, ఆహారమైనా.. బిడ్డల ఆకలి తీర్చడం కోసం పెట్టేది అమ్మానాన్న మాత్రమే. అందుకే వాళ్లు కనిపించే దేవతలు. అర్ధాకలితో అలమటిస్తూ కూడా కన్న బిడ్డల బాగోగుల కోసం పరితపిస్తున్న తల్లిదండ్రులకు కొదవలేదు. కష్టాలకోర్చి, జీతాన్ని, జీవితాలను త్యాగం చేస్తూ పిల్లలను ప్రయోజకులను చేయాలని వాళ్లు పడుతున్న తపన ముందు ఏదీ ఎక్కువ కాదు. జన్మనిచ్చి, జీవితాన్ని పరిచయం చేసి, సమాజంలో గొప్ప వ్యక్తులుగా నిలబెట్టేందుకు కష్టపడుతున్న తల్లిదండ్రులందరూ పూజనీయులే. అమ్మానాన్న అంటే గాంభీర్యం, గౌరవం, భక్తి, భయం, ప్రేమ ఇవన్నీ ఒకప్పటి మాట. ఇప్పుడు వారు మంచి స్నేహితులు. చదువు, ఉద్యోగం, పెళ్లి వంటి విషయాలను ఎలాంటి అమరికలు లేకుండా చర్చిస్తున్నారు. అమ్మ ప్రేమను పంచితే నాన్న భరోసా, భవిష్యత్తును అందిస్తాడు. అలాంటి వారిని మలి వయసులో వదిలేయకుండా, వృద్ధాశ్రమాలకు చేరకుండా చూడటం, ప్రేమను పంచడం ప్రతి ఒక్కరి కర్తవ్యం కావాలి. నేడు పేరెంట్స్ డే సందర్భంగా అన్నింటా తామై, బిడ్డల భవిష్యత్తు కోసం కష్టపడి, వారిని ప్రయోజకులను చేసిన తల్లిదండ్రులపై ప్రత్యేక కథనం. – 10లో..

రైల్వేకూ అత్తెసరే!

- ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు తగ్గిన ప్రాధాన్యం
- అన్నింటికి కలిపి రూ.382 కోట్లకుపైగా నిధులే
- తిరుపతి-కరీంనగర్ ట్రిప్పుల పెంపు, కొత్త రైళ్ల ఊసే లేదు
- కొత్తపల్లి-మనోహరాబాద్‌కు రూ.350 కోట్లు
- రామగుండం-మణుగూరుకు రూ.5 కోట్లు మాత్రమే
- పెద్దపల్లి-ఖాజీపేట బైపాస్ లైన్‌కు కేవలం రూ.లక్ష
- ప్రస్తావనకు రాని హసన్‌పర్తి-కరీంనగర్ రైల్వే లైన్
- పింక్ బుక్ విడుదలలో జాప్యం ఎందుకో?



రాజన్న సిరిసిల్ల జిల్లా బాలమల్లుపల్లె గ్రామం వద్ద కొనసాగుతున్న రైల్వేట్రాక్ పనులు



రామగుండం-మణుగూరుకు రూ.5 కోట్లే..

రామగుండం-మణుగురూ మధ్య ప్రస్తుతం ఉన్న 290 కి.మీలను 200 కి.మీలకు తగ్గించేందుకు భూపాల్లి మీదుగా ఈ లైన్ వేస్తున్నారు. 2022 డిసెంబరులో ఈ మార్గానికి ప్రధాని మోదీ రామగుండంలో శంకుస్థాపన చేశారు. కోల్‌కారిడార్‌గా పిలిచే ఈరైల్వే లైన్ పూర్తయితే.. 90.కి.మీల దూరం తగ్గడంతోపాటు, బొగ్గు తరలింపులో విప్లవాత్మక మార్పులు, సమ్మక్క-సారక్క, రామప్ప ఇతర ఆధ్యాత్మిక-పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. మొత్తం రూ.4000 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన ఈ ప్రాజెక్టుకు ఓటాన్ అకౌంట్‌లో రూ.5 కోట్లు కేటాయించగా ఇప్పుడు రూ.5 కోట్లే ఇచ్చారు. ఇలా అయితే ఈ ప్రాజెక్టు పూర్తికావడానికి ఎన్ని ఏళ్లు పడుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

రైల్వే బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ఈసారి పెద్దగా నిధులు రాలేదు. ఇటీవల కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పాత జిల్లా ప్రాజెక్టులకు ఏమాత్రం ప్రాధాన్యం దక్కలేదు. ఫిబ్రవరిలో పెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను పోల్చి చూస్తే మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైన్‌కు అదనంగా రూ.30 కోట్లు దక్కగా.. మణుగూరు-రామగుండం రైల్వేలైన్‌కు రూ.5 కోట్ల కోత పడింది. హసన్‌పర్తి-కరీంనగర్ రైల్వేలైన్ ప్రస్తావనే లేదు. ఇంకా కొన్ని పనులకు రూ.వెయ్యి, రూ.10,000, రూ.లక్ష కేటాయించడంపై జిల్లా వాసులు మండిపడుతున్నారు. ఇలాగైతే ప్రాజెక్టులు పూర్తవడానికి దశాబ్దాలు పడుతుందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మొత్తం మీద గత బడ్జెట్‌తో పోల్చినపుడు సగం నిధుల కోతపడగా.. కొత్త రైళ్లు, సర్వీసుల పెంపు ప్రస్తావన లేకపోవడం గమనార్హం. ఓటాన్ అకౌంట్‌లో పాత జిల్లాకు రూ.673 కోట్లు కేటాయించగా ఈసారి రూ.382 కోట్లకు అటూ ఇటూగా పరిమితమయ్యారు. తెలంగాణకు తక్కువ నిధులు కేటాయించారు కాబట్టే.. ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని ఈసారి పింక్ బుక్ విడుదలను దక్షిణమధ్య రైల్వే చేపట్టలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినా పింక్ బుక్ ప్రతిని 'సాక్షి' ఎక్స్‌క్లూజివ్‌గా సంపాదించింది.

కొత్తపల్లి-మనోహరాబాద్ కు రూ.350 కోట్లు

కరీంనగర్‌ను రాజధానితో కలిపే ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఇది. ఓటాన్ అకౌంట్ రూ.320 కోట్లు కేటాయించింది. ఇందులో రాష్ట్ర వాటాగా రూ.112 కోట్ల వరకు వెచ్చించాలి. ప్రస్తుతం రూ.350 కోట్లు ఇవ్వనుంది. అంటే రూ.30 కోట్లు నిధులు పెరిగాయి. పాత కరీంనగర్‌కు ఎంతో ముఖ్యమైన ఈ ప్రాజెక్టును గత ప్రభుత్వం 2016లో కేంద్రాన్ని ఒప్పించి రూ.1,167 అంచనా వ్యయంతో ప్రారంభించింది. 148 కి.మీల పొడవైన ఈలైన్ ఇప్పటి వరకూ మనోహరాబాద్ నుంచి సిద్దిపేట (75 కి.మీ)వరకు పూర్తయింది. ప్రస్తుతం ఈలైన్ వర్క్స్ సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బాలమల్లు పల్లె గ్రామం వరకు వచ్చాయి. ట్రాక్ పనులు చకచకా నడుస్తున్నాయి.

నామమాత్రం కేటాయింపులు..

- పెద్దపల్లి-నిజామాబాద్ సెక్షన్‌ను ఖాజీపేట బల్లార్ష సెక్షన్‌తో కలిపే బైపాస్ లైన్‌కు కేవలం రూ. లక్ష కేటాయించారు. పెద్దపల్లి శివారులో నిర్మిస్తున్న 2.1 కి.మీల పొడవైన ఈలైన్ రెండు సెక్షన్లకు వారధి.
- పెద్దపల్లి-కరీంనగర్-నిజామాబాద్ రైల్వేలైన్ (177 కి.మీ) కొత్తలైన్ రూ.1000 కేటాయించడం విశేషం.
- రాఘవాపురం-మందమర్రి (24.47 కి.మీ) డబ్లింగ్‌కు కేవలం రూ.1000 ఇచ్చారు.
- మంచిర్యాల-పెద్దంపేట (4.37 కి.మీ) డబ్లింగ్‌కి రూ.50 లక్షలు కేటాయించారు.
- ఉప్పల్-జమ్మికుంట రైల్వే ఓవర్ బ్రిడ్జికి రూ.2 కోట్లు, రామగుండం- బల్లార్షా విద్యుద్దీకరణ పనులకు రూ.25.99 కోట్లు కేటాయించారు.

కొత్తరైళ్లు, సర్వీసుల పెంపు లేనట్లే?

- ఉమ్మడి జిల్లాకు ముఖ్యంగా కరీంనగర్ నుంచి ఎలాంటి కొత్త రైళ్లు ప్రకటించలేదు.12 ఏళ్ల క్రితం వచ్చిన రెండు రైళ్లు మినహా ఆ తర్వాత ఒక్క రైలూ రాలేదు.
- ప్రస్తుతం ఉమ్మడి జిల్లా నుంచి ఏకైక రైలు కరీంనగర్-తిరుపతి బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ సర్వీసుల పొడగింపు, రెగ్యులరైజేషన్ మీద ఎలాంటి ప్రకటన రాలేదు.
- తిరుపతి రైలుపై గతంలో దక్షిణమధ్యరైల్వే సమ్మతించినా.. ఈ బడ్జెట్‌లో ప్రకటన లేకపోవడంపైభక్తులు మండిపడుతున్నారు.
- హసన్‌పర్తి-కరీంనగర్ రైల్వే లైన్ కోసం ఇటీవల ఫైనల్ లొకేషన్ (ఎఫ్ఎల్ఎస్) సర్వే రూ.5 కోట్లతో పూర్తి చేశారు. నిజాం కాలం నాటి ఈ ప్రతిపాదన ఈసారైనా పట్టాలెక్కుతుందనుకుంటే.. బడ్జెట్‌లో ఈలైన్‌కు చోటు దక్కకపోవడంతో జిల్లా వాసులు తీవ్ర నిరాశలో ఉన్నారు.

కేటాయింపులు అంకెల్లో..

- కొత్తపల్లి- మనోహరాబాద్(148 కి.మీ) రైల్వేలైన్: రూ.350,00,00,000.00
- రామగుండం- బల్లార్షా విద్యుదీకరణ: రూ.25,00,00,000.00
- రామగుండం-మణుగూరు(200 కి.మీ) రైల్వేలైన్: రూ.5,00,00,000.00
- ఉప్పల్-జమ్మికుంట రైల్వే ఓవర్ బ్రిడ్జికి రూ.2,00,00,000.00
- మంచిర్యాల-పెద్దంపేట (4.37కి.మీ) డబ్లింగ్ : రూ.50,00,000.00
- పెద్దపల్లి బైపాస్(2.1కి.మీ) లైన్‌కు రూ. 1,00,000.00
- పెద్దపల్లి-కరీంనగర్-నిజామాబాద్ (177. కి.మీ) రైల్వేలైన్ లైన్ రూ.1000.00
- రాఘవాపురం-మందమర్రి (24.47 కి.మీ) డబ్లింగ్‌కు రూ.1000.00

సాధనతో ఉన్నత శిఖరాలు



సమావేశానికి హాజరైన విద్యార్థులు

- భారత రైల్వే చీఫ్ విజిలెన్స్ అధికారి శ్రీనివాస్
- పాలిటెక్నిక్‌లో అలుమ్ని టాక్స్



మాట్లాడుతున్న శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రాజగోపాల్

వేములవాడఅర్బన్: సాధనతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని భారత రైల్వే చీఫ్ విజిలెన్స్ అధికారి గాజుల శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ మండలం అగ్రహారం శ్రీరాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం నిర్వహించిన అలుమ్నిటాక్స్‌కు హాజరయ్యారు. గాజుల శ్రీనివాస్ స్థానిక కళాశాలలోనే 1997–2000 సంవత్సరంలో చదువుకున్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ లేకుండా ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ ఇంజినీరింగ్‌లను ఊహించలేమన్నారు. దేశాభివృద్ధిలో కోర్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లు సివిల్, మెకానిక్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్ల పాత్రను వివరించారు. విద్యార్థులు ప్రాక్టికల్ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. భారత రైల్వేలో ఎలక్ట్రికల్ డిప్లొమా విద్యార్థులకు జూనియర్ ఇంజినీర్‌గా, లోకో పైలట్లు అవకాశాలున్నాయని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్ మాట్లాడుతూ అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో విద్యనభ్యసించిన వారు దేశవిదేశాల్లో ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డారన్నారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను ప్రస్తుత విద్యార్థులతో పంచుకునేందుకు అలుమ్నిటాక్స్ రూపొందించినట్లు తెలిపారు. లెక్చరర్లు రవీందర్, హిమజ, హసీనా బేగం, నర్మద, విద్యార్థులు పాల్గొన్నారు.


న్యూస్‌రీల్

సినారె జయంతికి సీఎంకు ఆహ్వానం



వేములవాడ: జ్ఞానపీఠ గ్రహీత సి.నారాయణరెడ్డి 93వ జయంతికి రావాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డికి ట్రస్ట్ ప్రతినిధులు ఆహ్వానం పలికారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈనెల 29న నిర్వహించే విశ్వంభర సినారె జాతీయ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం, పుస్తకావిష్కరణకు రావాల్సిందిగా ఆహ్వానపత్రిక అందించారు. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, శ్రీమతి సుశీలనారాయణరెడ్డి ట్రస్ట్ ప్రతినిధులు ఉన్నారు.

చండీయాగానికి కేంద్ర మంత్రికి ఆహ్వానం



సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో ఆదివారం నుంచి నాలుగు రోజులపాటు నిర్వహించే చండీయాగానికి రావాల్సిందిగా కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను పద్మశాలి పెద్దలు ఆహ్వానించారు. ఈమేరకు శనివారం ఆహ్వానపత్రిక అందజేశారు. గోలి వెంకటరమణ, మండల సత్యం, మోర రవి, గాజుల బాలయ్య, గుండ్లపెల్లి శ్రీనివాస్, గుజ్జె తార, అన్నల్‌దాస్ వేణు, గుండ్లపెల్లి పూర్ణచందర్ పాల్గొన్నారు.

సిరిసిల్ల మున్సిపల్‌లో బదిలీలు

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ బదిలీల్లో భాగంగా సిరిసిల్ల మున్సిపాలిటీలో పనిచేసే వివిధ విభాగాల ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఆర్వోగా పనిచేస్తున్న రాజిరెడ్డి జమ్మికుంటకు బదిలీకాగా ఆయన స్థానంలో హుజూరాబాద్ నుంచి కె.రామ్మోహన్, టీపీవో అన్సార్ వేములవాడకు బదిలీకాగా అక్కడ పనిచేస్తున్న కె.సాయికృష్ణ, టీపీఎస్‌లుగా పనిచేస్తున్న నవీన్ గ్రేటర్ వరంగల్, వినయ్ పెద్దపల్లికి బదిలీకాగా అదే స్థానాల నుంచి టీపీఎస్‌లుగా డి.శ్రావణి, జి.అభినవ్, జూనియర్ అసిస్టెంట్ జి.జ్యోతి బదిలీ కాగా అక్కడి నుంచి సిరిసిల్లకు కె.నర్సయ్య, సీనియర్ అసిస్టెంట్ ఎస్.మాలతి వేములవాడకు బదిలీకాగా ఆ స్థానంలో కె.శ్రీనివాస్ సిరిసిల్లకు బదిలీపై వచ్చారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వారిని కమిషనర్ డి.లావణ్య, మేనేజర్ మీర్జా ఫసహత్ అలీ, సహచర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

'మాఫీ'పై ఆందోళన వద్దు

- అర్హుల రుణాలు మాఫీ అవుతాయి
- ఐవోబీ పరిధిలో 291 మందివి పెండింగ్
- అవి కూడా పరిష్కారమవుతాయి
- ప్రజా ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు
- విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



'సాక్షి'తో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: జిల్లాలో పంట రుణాల మాఫీపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రూ.లక్షలోపు రుణాలు మాఫీ అయ్యాయని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పష్టం చేశారు. నిత్యం విధుల్లో బిజీగా ఉంటూనే.. క్షేత్రస్థాయిలో స్కూల్, కాలేజీలను తనిఖీ చేస్తూ ఉద్యోగులను పరుగులు పెట్టిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా విధుల్లో చేరినప్పటి నుంచి బిజీగా ఉంటున్న సందీప్‌కుమార్ ఝా.. రైతుల రుణమాఫీ, ప్రజా ఆరోగ్యం, ధరణి సమస్యలు, వర్షాకాలం వ్యాధులపై 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలపై మాట్లాడారు. కలెక్టర్ వెల్లడించిన అంశాలు..

రైతుల ఖాతాల్లో రూ.133 కోట్లు జమయ్యాయి

జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 23,330 మంది బ్యాంకు ఖాతాల్లో రూ.133కోట్ల పంట రుణం చేరింది. సింగిల్‌విండోల పరిధిలోనూ రైతుల రుణాలు మాఫీ అయ్యాయి. జిల్లాలో ఇంకా 291 మంది ఖాతాల్లో మరో రూ.2.66 కోట్లు జమకావాల్సి ఉంది. ఎల్లారెడ్డిపేట మండల పరిధిలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు పరిధిలో ఐఎఫ్ఎస్‌సీ కోడ్ తప్పుగా నమోదు చేయడంతో పెండింగ్‌లో ఉన్నాయి. దీనిపై నివేదిక పంపించాం. రెండో దశ రుణమాఫీలో క్లియర్ అవుతాయి. రుణమాఫీపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నిబంధనల మేరకు అర్హుల పంట రుణాలు మాఫీ అవుతాయి.

ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లాలో ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. వర్షాలు పడుతున్న నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లోనూ అప్రమత్తంగా ఉండాలని సూచించాం. క్రమం తప్పకుండా డ్రై డే నిర్వహిస్తున్నాం. దోమల నివారణ చర్యలు చేపట్టాం. జిల్లాలో ఏడు డెంగీ కేసులు నమోదయ్యాయి. అందరూ బాగానే ఉన్నారు. మలేరియా ఒక్క కేసు నమోదైంది. వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో వైద్యులు, సిబ్బంది బదిలీలు జరుగుతున్నాయి. ఇవి పూర్తికాగానే ప్రజా ఆరోగ్యంపై ఫోకస్ చేస్తాం. ప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ.. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రజా ఆరోగ్యం ప్రాధాన్యతను అందరూ గుర్తించాలి.

ఆరు గ్యారంటీల అమలుకు చర్యలు

ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీల్లోని వంటగ్యాస్ సిలిండర్ రాయితీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అర్హులైన ప్రతీ కుటుంబానికి అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ఏ కారణంతోనైన అర్హత ఉన్నా ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పొందని వారు కలెక్టరేట్‌లోని ప్రజాపాలన సేవ కేంద్రాన్ని సందర్శించాలి. లోటుపాట్లు ఉంటే సరిచేయించుకోవచ్చు. కలెక్టరేట్‌లో ఈసేవా కేంద్రం ఆఫీస్ పని దినాలలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పనిచేస్తుంది. ప్రజాపాలన సేవా కేంద్రాలకు వచ్చే వారు తమ వెంట రేషన్‌కార్డ్, ఆధార్‌కార్డు, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నంబర్, గ్యాస్ కనెక్షన్ నంబర్, ఎల్పీజీ కస్టమర్ ఐడీ, మొబైల్ నంబర్ వెంట తీసుకురావాలి. మునుముందు మరింతగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటాను.

ధరణి సమస్యలు పరిష్కరిస్తున్నాం

జిల్లాలో ధరణి సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నాం. ఇప్పటి వరకు వెయ్యి దరఖాస్తులు వివిధ స్థాయిలలో పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని తహసీల్దార్లు, ఆర్డీవోలు, అదనపు కలెక్టర్ పరిశీలించి పరిష్కరిస్తారు. నా పరిధిలోనూ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాను. ధరణి పెండింగ్‌లో రాష్ట్ర స్థాయిలో జిల్లా మూడు, నాలుగు స్థానాల్లో ఉంది. కోర్టు కేసులు మినహా ఇతర ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తున్నాం.

కాలేజీల్లో కొత్త భవనాలకు ప్రతిపాదించాం

జిల్లాలోని జూనియర్ కళాశాలలో కొత్త భవనాలకు ప్రతిపాదించాం. వేములవాడలోని జూనియర్ కాలేజీలో కొన్ని గదులు శిథిలావస్థకు చేరాయి. దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపాం. అవసరమైన మేరకు కొత్త భవనాలు నిర్మిస్తాం. స్కూళ్లలో టాయిలెట్ల సమస్య ఉంది. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా కొన్ని పనులు పూర్తయినా.. ఇంకా చేయాల్సిన పనులు ఉన్నాయి. స్కూళ్లు, హాస్టళ్లను తనిఖీ చేసి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ఇంటర్మీడియెట్‌లో ప్రమాణాలు పెంచే దిశగా చర్యలు తీసుకుంటాం.

మిడ్‌మానేరుకు ఎల్లంపల్లి జలాలు



బోయినపల్లి(చొప్పదండి): శ్రీరాజరాజేశ్వర(మిడ్‌మానేరు) ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి జలాలు వచ్చి చేరుతున్నాయి. రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రీ పంప్ హౌస్ నుంచి వరదకాల్వమీదుగా శనివారం రాత్రి 9 గంటల వరకు ప్రాజెక్టులోకి 2,500 క్యూసెక్కుల మేర నీరు వచ్చి చేరుతోంది. మరో 280 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టులో 5.90 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

పోతుగల్‌లో ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత



ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఇసుక ట్రాక్టర్లు అతివేగంగా వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయంటూ మండలంలోని పోతుగల్ గ్రామస్తులు శనివారం ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. మండలంలోని ఆవునూర్ మానేరువాగు నుంచి టోకెన్లతో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్నారు. పోతుగల్ గ్రామస్తులు మాట్లాడుతూ ఆవునూర్ నుంచి గూడెం మీదుగా ముస్తాబాద్ వెళ్లేందుకు అనుమతులు ఇచ్చిన రెవెన్యూ అధికారులు.. పోతుగల్ మీదుగా వెళ్తున్న ట్రాక్టర్లను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. పోతుగల్, ముస్తాబాద్ గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయని, గతంలో అనేక ప్రమాదాలు జరిగాయన్నారు. గ్రామస్తుల ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు పోతుగల్‌కు చేరుకుని పర్మిట్ ఉన్న గ్రామాల మీదుగానే ట్రాక్టర్లు నడపాలని డ్రైవర్లకు సూచించారు. డీజే సౌండ్లు పెట్టుకొని అతివేగంగా వెళ్లవద్దని హెచ్చరించారు.

నేతన్నలకు ఉపాధి కల్పించాలి



ఇందిరాపార్క్ వద్ద నిరసన తెలుపుతున్న నేతన్నలు

సిరిసిల్ల: నేతన్నలు శనివారం చలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. నేతన్నలకు ఉపాధి కల్పించాలని, మరమగ్గాలకు విద్యుత్ రాయితీ అందించాలని, బతుకమ్మ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ నేతన్నలు హైదరాబాద్‌కు వెళ్లారు. ఇందిరాపార్క్ వద్ద నిరసన తెలిపారు. సీపీఐ ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్సీ చెరిపల్లి సీతారాములు, కార్మిక నాయకులు కూరపాటి రమేశ్, స్కైలాబ్ బాబు, పంతం రవి, మూషం రమేశ్, సిరిసిల్ల జేఏసీ నాయకులు తాటిపాముల దామోదర్, ఆడెపు భాస్కర్, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరో రోజుకు రిలేదీక్షలు

సిరిసిల్ల అంబేడ్కర్ సర్కిల్‌లో శనివారం ఆరో రోజుకు రిలేదీక్షలు కొనసాగాయి. ఈ దీక్షల్లో పాలిస్టర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దూడం రమేశ్, కార్మిక నాయకులు ఉడుత రవి, జిందం మహేశ్, మరిపెద్ది ప్రభాకర్, జిందం రవి, చందుపట్ల పోచమల్లు, బచ్చు రామచంద్రం, మంగళారపు లక్ష్మీనారాయణ, జిందం దేవదాసు పాల్గొన్నారు.

ఉత్తరం రాద్దాం రండి



సిరిసిల్లకల్చరల్: బాల సాహిత్యం విస్తృతిని పెంచే ప్రక్రియలో భాగంగా బడి పిల్లలకు ఉత్తరం ప్రత్యేకతను నేటి తరానికి తెలియజేసేందుకు 'అవ్వ తాతలకు ఉత్తరం రాద్దాం రండి' పేరుతో జిల్లాలో 30 పాఠశాలల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మానేరు రచయితల సంఘం ప్రతినిధి ఎలగొండ రవి తెలిపారు. ఈమేరకు సంబంధిత వాల్‌పోస్టర్‌ను గీతానగర్ జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శారద శనివారం ఆవిష్కరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్ బాల సాహిత్య రజతోత్సవం సందర్భంగా చొక్కాపు వెంకటరమణ సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గరిపెల్లి అశోక్, డాక్టర్ సిరిసిల్ల చందన, కన్వీనర్లు ఆడెపు లక్ష్మణ్, నరేందర్, రాజలింగం, సురేశ్, మంజుల, జయంతి పాల్గొన్నారు.

అంతగిరి పోచమ్మ ఆలయంలో టెండర్లు

సిరిసిల్లటౌన్: ఇల్లంతకుంట మండలం అంతగిరి పోచమ్మ ఆలయంలో లడ్డు, పులిహోర ప్రసాదం, కొబ్బరిముక్కలు పోగుచేసుకునే హక్కుకు టెండర్లు వేస్తున్నట్లు ఈవో మారుతీరావు శనివారం ప్రకటనలో తెలిపారు. 2024 సెప్టెంబర్ 1 నుంచి 2025 ఆగస్టు 31 వరకు ప్రసాదాల విక్రయం, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు సీల్డ్ కమ్ బహిరంగవేలం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. టెండర్‌లో పాల్గొనే వారు విడిగా లడ్డు, పులిహోర ప్రసాదానికి రూ.లక్ష, కొబ్బరిముక్కలకు రూ.20వేల ధరావతు, లేని పక్షంలో ఏదేని జాతీయబ్యాంకులో డీడీ తీసి సీల్డ్‌టెండర్ ఫారానికి జతపర్చాలని సూచించారు. ఆగస్టు 9వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. టెండర్ రోజున పోస్ట్‌డేటెడ్ చెక్కును తప్పక తీసుకురావాలని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

సంతానం కలగడం లేదని వివాహిత ఆత్మహత్య


గీత (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సంతానం కలగడం లేదని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్‌పూర్‌కు చెందిన గీత(25)కు సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేటకు చెందిన తలారి శంకర్‌తో రెండేళ్ల క్రితం వివాహం జరిపించారు. అతనికి ఇది రెండో పెళ్లి. సంతానం కలగడం లేదని ఆ దంపతులు బాధపడుతున్నారు. ఈ క్రమంలో శంకర్ శుక్రవారం భార్యను ఆమె పుట్టింట్లో దింపి, వెళ్లాడు. పుట్టింటి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండటం, మరోవైపు సంతానం కలగడం లేదని గీత మనస్తాపానికి గురైంది. శనివారం తెల్లవారుజామున ఇంట్లోనే ఉరేసుకుంది. ఎస్సై రమాకాంత్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి గతంలోనే మృతిచెందగా తల్లి రాజమణి ఉంది.

బెంగళూరులో కేసీఆర్‌నగర్‌వాసి దుర్మరణం


ఖాజాపాషా మృతదేహం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని మండెపల్లి డబుల్ బెడ్‌రూం సముదాయం(కేసీఆర్‌నగర్) కాలనీకి చెందిన ఖాజాపాషా(50) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. ఖాజాపాషా శుక్రవారం మట్టి వినాయక విగ్రహాలను ఆటోలో సిరిసిల్ల నుంచి బెంగళూరుకు తీసుకెళ్లేందుకు కూలీగా వెళ్లాడు. అక్కడ విగ్రహాలను అన్‌లోడ్ చేసిన తర్వాత రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని, అక్కడికక్కడే మరణించాడు. మృతుడికి తల్లి షహనాజ్, భార్య మెహరున్నీసా, ఇద్దరు కూతుళ్లు షబానా, ఆస్మా ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి


శంకర్ (ఫైల్)

ధర్మపురి: పొలం పనులకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొని రైతు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని గోవిందుపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై ఉదయ్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోల శంకర్ (40) శనివారం ఉదయం పొలం పనులకు వెళ్లాడు. ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా నేరెళ్ల జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో శంకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఢీకొట్టిన ద్విచక్రవాహనదారుడు పరారీలో ఉన్నాడు. శంకర్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



బోయినపల్లి(చొప్పదండి): కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా శనివారం మాట్లాడారు. వాగులు, చెరువుల వద్దకు వెళ్లవద్దని సూచించారు. తహసీల్దార్ పుష్పలత ఉన్నారు.

అమ్మానాన్న.. పిల్లలే మిన్న

- కనిపెంచే దేవతలు
- బిడ్డలను ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్న తపన
- కష్టాలకోర్చి, జీతం, జీవితం త్యాగం
- ప్రయోజకులను చేసి, మురిసిపోతున్న తల్లిదండ్రులు
- నేడు పేరెంట్స్ డే

సండే స్పెషల్

అమ్మానాన్న.. పిల్లల భవిష్యత్తు కోసం కష్టాలకోర్చి, జీతాన్ని, జీవితాన్ని త్యాగం చేస్తారు. తాము ఎలా బతికినా బిడ్డలు మాత్రం ఉన్నత స్థాయిలో ఉంటే చాలన్న తపన. అందుకోసం అహోరాత్రులు శ్రమిస్తారు. ఆ శ్రమను గుర్తిస్తున్న పలువురి కుమారులు, కూతుళ్లు ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. తల్లిదండ్రులకు పేరు తీసుకువచ్చి, యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. పిల్లలను ఉన్నత స్థాయికి చేర్చిన తల్లిదండ్రులపై ఈ వారం సండే స్పెషల్.

పల్లె నుంచి విదేశాలకు..


తల్లిదండ్రులతో వంశీ, గ్రీష్మ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నారాయణపూర్‌కు చెందిన లద్దునూరి తిరుపతి-రేణుక దంపతులకు ఇద్దరు సంతానం. కొడుకు వంశీ ఎండీ పీడియాట్రిషన్ పూర్తి చేసి, లండన్ వెళ్లగా, కూతురు గ్రీష్మ ఇంజినీరింగ్ పూర్తి చేసి, అమెరికాకు చెందిన ఎంఎన్‌సీ కంపెనీలో పని చేస్తోంది. వంశీ దావోస్‌లో వైద్య విద్యనభ్యసించేందుకు తండ్రి తిరుపతి తనకున్న వ్యవసాయ భూములను అమ్మేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా కొడుకు, కూతురును ఉన్నతంగా చూడాలన్న సంకల్పంతో ముందుకెళ్లి, సక్సెస్ అయ్యారు. పిల్లలిద్దరూ ఉన్నత స్థానాల్లో స్థిరపడటంతో ఆ దంపతులు మొదటినుంచి పడిన కష్టాలను మరిచిపోయారు. వారి సంతోషానికి అవధుల్లేవు.

ప్రైవేట్ టీచర్.. పిల్లలు ఐఐటీ


అమ్మానాన్నతో సాయిప్రీతమ్, ఆదర్శసాయి

సిరిసిల్ల కల్చరల్: వెంకంపేటకు చెందిన ఆడెపు శ్రీనివాస్-సుజాత దంపతులకు ఇద్దరు అబ్బాయిలు సాయిప్రీతమ్, ఆదర్శ్ సాయి ఉన్నాయి. ప్రైవేట్ టీచర్‌గా జీవితాన్ని ప్రారంభించిన శ్రీనివాస్ తన పిల్ల లకు మంచి చదువే నిజమైన ఆస్తిగా భావించారు. కుటుంబంతో సహా హైదరాబాద్ వెళ్లారు. అక్కడ ప్రైవేట్ స్కూళ్లలో పని చేస్తూనే కుమారులను ఉన్నత చదువులు చదివించారు. పెద్ద కొడుకు సాయిప్రీతమ్‌ను ఖరగ్‌పూర్‌లో ఐఐటీ పూర్తి చేశాడు. ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే ప్రభుత్వ ఉద్యోగ సాధనకు ప్రయత్నాలు చేస్తున్నాడు. చిన్న కొడుకు హైదరాబాద్ ఐఐటీలో ఫైనలియర్ చదువుతున్నాడు. రెండు దశాబ్దాల తమ కష్టం ఫలించిందని ఆ తల్లిదండ్రులు సంతోషిస్తున్నారు.

డ్రైవర్ కుమారుడు, కూతురు..


పిల్లలతో సత్యనారాయణ-పద్మ

రామగిరి(మంథని): మండలంలోని కల్వచర్లకు చెందిన పాల్తెం సత్యనారాయణ-పద్మ దంపతులకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. సత్యనారాయణ ఓ ప్రైవేట్ కంపెనీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పద్మ ఇంటివద్దే కుట్టు మెషిన్ నిర్వహిస్తోంది. పిలలను ఉన్నత స్థాయిలో ఉంచాలని తపన పడ్డారు. వారిని అర్థం చేసుకున్న కుమారుడు, కూతురు ఉన్నత చదువులు చదివారు. రాము ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్నాడు. రమ్య ఆదాయ పన్ను శాఖలో ట్యాక్స్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తోంది. అమ్మానాన్న ప్రోత్సాహంతోనే తాము ఈ స్థితిలో ఉన్నామని వారు తెలిపారు.

నేత కుటుంబం నుంచి లెక్చరర్‌గా..


తల్లిదండ్రులతో మార్కండేయ

మానకొండూర్: మండలంలోని చెంజర్లకు చెందిన బైరి ఎల్లయ్య-కమల దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. వీరిది చేనేత కుటుంబం. ఎల్లయ్య ఏడోతరగతి వరకే చదువుకున్నాడు. నిత్యం మగ్గం వర్క్ చేస్తూ.. నేసిన బట్టలను సైకిల్‌పై పెట్టుకొని ఊరూరా తిరిగి విక్రయించేవారు. తాను పడిన కష్టం పిల్ల లు పడొద్దని వారిని ఉన్నత చదువులు చదివించారు. పెద్ద కుమారుడు తిరుపతి ఓ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా, కూతురు స్వరూప ఓ కళాశాలలో ట్యూటర్‌గా పని చేస్తున్నారు. చిన్న కుమారుడు మార్కండేయ 2006లో ఎస్జీటీ, 2012లో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 2012లో గ్రూప్-2 ఉద్యోగం వచ్చినా చేరలేదు. ప్రస్తుతం వెల్గటూర్ హైస్కూల్లో ఇంగ్లిష్ టీచర్‌గా పని చేస్తున్నారు. ఇటీవల జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు.

ముగ్గురు కుమారులూ ఉద్యోగులే..


కుమారులతో మల్లమ్మ-వెంకటనర్సయ్య

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని తడగొండకు చెందిన ఎడపెల్లి మల్లమ్మ-వెంకటనర్సయ్య దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్ద కొడుకు శ్రీనివాస్ ఆర్టీసీ కండక్టర్‌గా, రెండో కుమారుడు రమేశ్ జిల్లా కేంద్రంలో పోలీస్‌గా, మూడో కుమారుడు చంద్రశేఖర్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వెంకటనర్సయ్య ప్రభుత్వ పాఠశాలలో అటెండర్‌గా పని చేస్తూ పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. తమ కష్టానికి ఫలితంగా ముగ్గురు కుమారులూ ప్రయోజకులయ్యారని ఆ దంపతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ ఎదుగుదల వెనక అమ్మానాన్న ప్రోత్సాహం ఎంతో ఉందని అన్నదమ్ములు తెలిపారు.

ముగ్గురి చదువులు ఉస్మానియాలో..


పిల్లలతో శ్రీనివాస్-మానస దంపతులు

జమ్మికుంట(హుజూరాబాద్): పెద్దపెల్లి జిల్లా పొత్కపెల్లి మండలంలోని శానగొండకు దూడం శ్రీనివాస్-మానస దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. వీరు బతుకుదెరువు కోసం జమ్మికుంటకు వచ్చారు. శ్రీనివాస్ పట్టణంలోని ఓ ప్రైవేట్ కంపనీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. కూతురు రమ్య ఉస్మానియాలో బీఎస్సీ నర్సింగ్ చేసి, ప్రస్తుతం కరీంనగర్ మెడికల్ కళాశాలలో నర్సింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించింది. పెద్ద కుమారుడు రాహుల్ ఉస్మానియాలో ఎంబీబీఎస్ పూర్తి చేసి, పీజీ కోసం ప్రయత్నం చేస్తున్నాడు. చిన్న కుమారుడు రామకృష్ణ సైతం ఉస్మానియాలోనే ఎంబీబీఎస్ ఫైనలియర్ చదువుతున్నాడు. పిల్లలు అత్యంత ప్రతిభతో ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీట్లు సాధించి, ప్రయోజకులవడంతో తల్లిదండ్రులు గర్వపడుతున్నారు.

వ్యాపారంలో ఒడిదొడుకులొచ్చినా..


తల్లిదండ్రులతో వంశీ, వైష్ణవి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన బుస్స గంగాధర్-కవిత దంపతులకు కొడుకు వంశీ, కూతురు వైష్ణవి ఉన్నారు. వీరిది వ్యాపార కుటుంబం. వ్యాపారంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదురయ్యాయి. అన్నింటినీ తట్టుకొని పిల్లలిద్దరినీ కప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ చదివించారు. ప్రస్తుతం వంశీ అమెరికాలో ఉద్యోగం చేస్తుండగా, వైష్ణవి క్యాబ్ జెమినీలో పని చేస్తోంది. పిల్లలు ఉన్నత స్థాయిలో ఉండటం చూసి, ఆనందపడుతున్నారు.

వ్యవసాయ కుటుంబం నుంచి..


ఐఐటీ పట్టా, అమ్మానాన్నతో అఖిల్ (ఫైల్)

వీర్నపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన గుగులోత్ తిరుపతి-కౌసల్య దంపతులకు ఇద్దరు కుమారులు అరవింద్, అఖిల్ ఉన్నారు. వీరిది వ్యవసాయాధారిత కుటుంబం. పిల్లలను కష్టపడి చదివించారు. పెద్ద కొడుకు బద్దనపల్లి పోస్టాఫీస్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు అఖిల్ మద్రాస్ ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశాడు. ప్రస్తుతం ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఏడాదికి రూ.19 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ గిరిపుత్రులిద్దరూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

రైతుబిడ్డ ఎస్సై..


అమ్మానాన్నతో మహేశ్

మల్యాల(చొప్పదండి): మండలంలోని లంబాడిపల్లికి చెందిన గంగుల సారమ్మ-మల్లయ్య దంపతుల ఒక్కగానొక్క కుమారుడు మహేశ్. వీరిది వ్యవసాయ కుటుంబం. రెండెకరాల్లో తల్లిదండ్రులు వరి సాగు చేస్తుంటే మహేశ్ కూడా వారి సాయపడుతూ 4 కిలోమీటర్ల దూరంలోని తాటిపల్లి హైస్కూల్‌కు వెళ్లి చదువుకున్నాడు. పదిమందికి సాయం చేసే స్థాయిలో ఉండాలన్న అమ్మానాన్న మాటలతో పదోతరగతిలో 555/600 మార్కులు సాధించి, బాసర ట్రిపుల్‌ఐటీలో సీటు పొందాడు. కోర్సు పూర్తయ్యాక సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చినా పోటీ పరీక్షల వైపు మొగ్గుచూపాడు. పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం వచ్చినప్పటికీ ఎస్సై పోస్టు కోసం ప్రిపేరయ్యాడు. మొదటి ప్రయత్నంలోనే సివిల్ ఎస్సైగా ఉద్యోగం సాధించాడు.

కొత్తగట్టు నుంచి ఐఏఎస్..

శంకరపట్నం(మానకొండూర్): కొత్తగట్టు గ్రామానికి చెందిన కోరెం శ్రీనివాస్‌రెడ్డి-ప్రమీల దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్ద కొడుకు వాసుదేవరెడ్డి టీచర్, రెండో కుమారుడు మల్లారెడ్డి వ్యవసాయం, చిన్న కుమారుడు అశోక్‌రెడ్డి ఐఏఎస్ ఆఫీసర్. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూనే పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. అమ్మానాన్నతోపాటు సోదరుడు వాసుదేవరెడ్డి ప్రోత్సాహంతో అశోక్‌రెడ్డి ఐఏఎస్ సాధించారు. గతంలో ఐఅండ్‌పీఆర్ స్పెషల్ కమిషనర్‌గా పని చేశారు. ప్రస్తుతం హార్టికల్చర్ కమిషనర్‌గా హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఇద్దరు సోదరులు మరణించారు. తన భవిష్యత్తును ఉన్నతంగా తీర్చినందుకు తల్లిదండ్రులను అశోక్‌రెడ్డి కంటికిరెప్పలా చూసుకుంటున్నారు.


- తండ్రితో ఐఏఎస్ అధికారి అశోక్‌రెడ్డి

పెద్దమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లో చోరీ


వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల బొప్పాపూర్ శివారు సిరిసిల్ల-కామారెడ్డి ప్రధాన రహదారి పక్కనున్న పెద్దమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. దొంగలు శుక్రవారం రాత్రి రెండు ఆలయాల్లో చొరబడ్డారు. పెద్దమ్మ ఆలయంలో అమ్మవారి పుస్తెలు, ముక్కుపుడక, ఎల్లమ్మ ఆలయ హుండీ చోరీ చేశారు. ఆలయాల ఆవరణ శుభ్రం చేసే కోల నర్సయ్య శనివారం ఉదయం 5 గంటలకు వచ్చాడు. తలుపులు ధ్వంసమై ఉండటంతో విషయాన్ని వెంటనే గ్రామస్తులు, పోలీసులకు చేరవేశారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించారు. జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీంను రప్పించి, వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని, దొంగల కోసం గాలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

అప్పలిచ్చి, అక్రమంగా ఆస్తుల స్వాధీనం

- వ్యక్తిపై కేసు

సిరిసిల్ల క్రైం: అప్పుగా తీసుకున్న సొమ్ముకు ముందుగానే బాండ్ పేపర్ రాయించడంతోపాటు ఆస్తుల పత్రాలు తాకట్టు పెట్టుకుంటున్నాడు.. తర్వాత ఆ ఆస్తులను స్వాధీనం చేసుకుంటున్నాడు.. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సిరిసిల్లలో శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్‌కు చెందిన దుబాల మొండయ్య అధిక వడ్డీకి అప్పులిస్తున్నాడు. అనంతరం తీసుకున్నవారి ఆస్తులను అక్రమంగా స్వాధీనం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఖాళీ బాండ్ పేపర్లపై సంతకాలు పెట్టించుకోవడంతోపాటు ఇంటి పత్రాలను తాకట్టు పెట్టుకొని, అప్పులు చెల్లించని వారి ఆస్తులను స్వాధీనం చేసుకుంటున్నాడని పలువురు బాధితులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇచ్చిన మొత్తం కన్నా ఎక్కువ విలువైన ఆస్తులను తన పేరిట గానీ, ఇతరులకు అమ్మినట్లు గానీ రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మొండయ్య కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే ఫిర్యాదు చేయాలని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై అప్రమత్తంగా ఉండాలి

- చైన్ మార్కెటింగ్‌పై నిఘా
- మోసపోతే 1930లో ఫిర్యాదు చేయండి
- ఎస్పీ అఖిల్ మహాజన్


అఖిల్ మహాజన్, ఎస్పీ

సిరిసిల్లక్రైం: ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ శనివారం ప్రకటనలో కోరారు. ఆన్‌లైన్, మల్టీలెవల్, చైన్‌మార్కెటింగ్‌లపై పోలీస్ నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభాలు అంటూ మోసపూరిత ప్రచారాలను నమ్మొద్దని కోరారు. గొలుసుకట్టు వ్యాపారాలలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయంటూ సైబర్‌మోసగాళ్లు నమ్మించి కుచ్చుటోపీ పెడుతున్నారని, జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. సైబర్ నేరం జరిగితే 1930లో ఫిర్యాదు చేయాలని, సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో ఇటీవల జరిగిన ఆన్‌లైన్ మోసాల గురించి వివరించారు.


ముసురుకున్న వాన

సిరిసిల్ల: జిల్లాను ముసురు వాన వీడడం లేదు. వారం రోజులుగా కురుస్తున్న ముసురు వర్షంతో జిల్లాలోని పలు చెరువులు, కుంటల్లోకి పెద్దగా నీరు చేరలేదు. సిరిసిల్ల మానేరువాగు, వేములవాడ మూలవాగుల్లో పడువాటు నీరు చిన్నపాటి పాయగా పారుతోంది. గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు, కోనరావుపేట మండలం నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టులు నిండకపోవడంతో వాగుల్లో పడువాటు నీరు పారుతోంది. జిల్లా వ్యాప్తంగా 666 చెరువులు, కుంటలు ఉండగా.. ఇప్పటి వరకు 106 చెరువుల్లో 25శాతం మేరకు నీరు చేరింది. మరో 67 చెరువుల్లో 50 శాతం నీరు చేరింది. 27 చెరువుల్లో 50 నుంచి 75 శాతం నీరు చేరింది. ఒక్క చెరువు కూడా పూర్తి స్థాయిలో నిండలేదు. వ్యవసాయ పనులకు ముసురు వర్షాలు ఆటంకంగా మారాయి. పత్తిలో దౌర కొట్టేందుకు, వరినాట్లు వేసేందుకు ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి.

చిత్తడిగా రోడ్లు

సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని వీధులు వర్షాలతో చిత్తడిగా మారాయి. పట్టణాల్లోని శివారు కాలనీల్లో బురద రోడ్లు దర్శనమిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోనూ రోడ్లు బురదతో నిండిపోయాయి. అడుగుతీసి అడుగువేయలేని స్థితిలో గ్రామీణరోడ్లు ఉన్నాయి.


మూలవాగు ప్రాజెక్టులోకి చేరుతున్న నీరు


రామన్నపేటలో కూలిన ఇల్లు

కూలిన ఇల్లు

చందుర్తి(వేములవాడ): మండలంలోని రామన్నపేటకు చెందిన భీంరాజు శంకరయ్య అనే కూలీ ఇల్లు వర్షానికి తడిసి శనివారం కూలింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిసి కూలిపోయిందని గ్రామస్తులు తెలిపారు. ఇల్లు కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. కాగా రెవెన్యూ అధికారులు కూలిన ఇంటిని పరిశీలించారు.

మూలవాగు ప్రాజెక్ట్‌లోకి చేరుతున్న నీరు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్ట్‌లోకి వరదనీరు చేరుతోంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు 19 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల మూలవాగు ప్రాజెక్ట్‌లో ఇప్పటి వరకు 4 అడుగుల మేర నీరు చేరింది.

గంజాయి నియంత్రణకు స్పెషల్ డ్రైవ్

- మూడు నెలలకోసారి సమావేశం
- సీపీఆర్‌పై అవగాహన ఉండాలి
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: జిల్లాలో గంజాయి నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. కలెక్టరేట్‌లో శనివరం మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి జిల్లాస్థాయి అధికారులతో నార్కోటిక్ కంట్రోల్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు సరఫరా చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. యువత డ్రగ్స్‌కు ఆకర్షితులైతే దేశ భవిష్యత్ నాశనమవుతుందన్నారు. మత్తుకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. గంజాయి సాగు కనిపిస్తే అటవీశాఖ అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతీ నెల ఆస్పత్రులు, మెడికల్ షాపుల్లో స్టాక్ వివరాలు పరిశీలించాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రతీ మూడు నెలలకోసారి జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. డ్రగ్స్ వినియోగంతో కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

అందుబాటులో టెస్టింగ్‌కిట్స్

గంజాయి సేవించిన వారి శాంపిళ్లను పరీక్షించే కిట్లు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు. గంజాయిని అరికట్టేందుకు విస్తృత తనిఖీలు చేపడుతున్నామన్నారు. డ్రంకెన్ డ్రైవ్ తరహాలో గంజాయి కిట్లతో తనిఖీలు చేస్తున్నామని, పాజిటివ్ వచ్చిన వారి నుంచి సరఫరాదారులను పట్టుకుంటున్నట్లు తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ రెవెన్యూ డివిజన్ అధికారులు రమేశ్, రాజేశ్వర్, జిల్లా అటవీ అధికారి బాలమణి, జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్‌కుమార్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి వసంత్‌రావు, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ భవాని పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

సీపీఆర్(కార్డియో పల్మనరీ రిసోసియేషన్)పై అందరికీ అవగాహన ఉండాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. సీపీఆర్‌పై శనివారం అవగాహన కల్పించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ సీపీఆర్‌పై అవగాహనతో విలువైన ప్రాణాలు కాపాడవచ్చన్నారు. సడన్ కార్డియాక్ అరెస్టు అయినప్పుడు ప్రథమ చికిత్స అందించాలన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ స్వయంగా సీపీఆర్ చేసి చూపించారు. డీఎంహెచ్‌వో వసంతరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజగోపాల్, ప్రోగ్రాం ఆఫీసర్ ఉమాదేవి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సిరిసిల్లటౌన్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత శుభ్రతపై ప్రజలకు వివరించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆస్పత్రి సిబ్బందికి సూచించారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ యూపీహెచ్‌సీని శనివారం పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. ఈనెలలో ప్రసూతి లక్ష్యం చేరుకున్నారా.. అని సిబ్బందిని ప్రశ్నించగా.. 34 లక్ష్యానికి 24 డెలివరీలు చేసినట్లు తెలిపారు. అనంతరం ఆస్పత్రిలోని రక్తపరీక్షల గది, ఫార్మస్టోర్, ఐపీ, ఓపీ వార్డులు, బెడ్స్, టాయిలెట్స్‌ను పరిశీలించారు. వైద్యాధికారి కృష్ణవేణి, సిబ్బంది ఉన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి

సిరిసిల్ల: రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని జిల్లా వ్యవసాధికారి వడ్డెపల్లి భాస్కర్ సూచించారు. వ్యవసాయ శాఖ, కరీంనగర్ ఏరువాక కేంద్రం, పరిశోధనస్థానం అధికారులు శనివారం నిర్వహించిన ఫోన్‌ఇన్‌లో రైతులకు సలహాలు, సూచనలు అందించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు ఫోన్ చేసి తమ సందేహాలకు సమాధానాలు పొందారు. జిల్లా వ్యవసాయాధికారి వడ్డేపల్లి భాస్కర్, కరీంనగర్ వ్యవసాయ పరిశోధనస్థానం, కరీంనగర్ ప్రధాన శాస్త్రవేత్త జి.మంజులత, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త, సమన్వయకర్త కె.మదన్‌మోహన్‌రెడ్డి, శాస్త్రవేత్త ఎం.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

